సాక్షి వైఎస్ఆర్ జిల్లా

గురువారం । 23 । నవంబర్ । 2023



మధ్యాహ్న భోజనంలో బల్లి

మదనపల్లె మండలం టేకులపాలెం ఎంపీ యూపీ పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనంలో బల్లి పడింది. ఈ ఆహారం తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. -8లో



రాచమల్లు దాతృత్వం

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మరో మారు తన దాతృత్వాన్ని చాటుకున్నారు. పేద ఎస్సీ విద్యార్థిని ఎంబీబీఎస్ చదివేందుకుయ్యే ఖర్చు వెచ్చిస్తానని తెలిపారు. -8లో

గరిష్టం/కనిష్టం
30.9/24.1

వాతావరణం

జిల్లాలో బుధవారం 24.1 – 30.9 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 5.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

మూడు పోలీస్‌స్టేషన్లు అప్‌గ్రేడ్

కడప అర్బన్: జిల్లాలోని ఖాజీపేట, చెన్నూరు, చింతకొమ్మదిన్నె పోలీస్‌స్టేషన్‌లను అప్‌గ్రేడ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ల సంఖ్య 20కి చేరింది.

నేడు డయల్ యువర్ ఆర్ఎం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఆర్టీసీ సంబంధిత సమస్యల పరిష్కారానికి గురువారం 'డయల్ యువర్ ఆర్ఎం' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్ రెడ్డి తెలిపారు. సాయంత్రం 4.00 నుంచి 5.00 గంటల వరకు ఆర్టీసీ ప్రయాణికుల కోసం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని.. సమస్యలు, సూచనలు, సలహాలను 99592 25848 నంబరులో తెలియజేయచ్చన్నారు.

శబరిమలైకి మరో రైలు

కడప కోటిరెడ్డిసర్కిల్: అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం విజయవాడ నుంచి కడప మీదుగా కొట్టాయంకు మరో ప్రత్యేక రైలు (07139)ను నడపనున్నారని కడప రైల్వే చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాష తెలిపారు. విజయవాడ నుంచి కొట్టాయంకు డిసెంబరు 15, 22.. జనవరి 3వ తేదీన ఈ రైలు బయలుదేరుతుందన్నారు. ఈ రైలుకు కడప, ఎర్రగుంట్ల స్టేషన్లలో మాత్రమే స్టాపింగ్ కల్పించారన్నారు. తిరుగు ప్రయాణంలో ఈ రైలు (07140) కొట్టాయం నుంచి విజయవాడకు డిసెంబరు 17, 24.. జనవరి 7వ తేదీన బయలుదేరుతుందన్నారు.

అరక్కోణం ప్యాసింజర్ రద్దు

కడప కోటిరెడ్డిసర్కిల్: తిరుపతి–రేణిగుంట మార్గంలో రోలింగ్ కారిడార్ పనులు జరుగుతుండటంతో కడప–అరక్కోణం మధ్య నడుస్తున్న ప్యాసింజర్ రైలును డిసెంబరు 3వ తేదీ వరకు రద్దు చేసినట్లు కడప రైల్వే చీఫ్ టిక్కెట్ ఇన్‌స్పెక్టర్ ఉమర్‌బాష, కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్‌లు తెలిపారు. కాగా, పూణె–కన్యాకుమారి మధ్య నడుస్తున్న జయంతి ఎక్స్‌ప్రెస్(16381/82)ను దారిమళ్లింపు 3వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. అలాగే మధురై–ఓకా వారాంతపు రైలును డిసెంబరు 1వ తేదీన దారి మళ్లించినట్లు తెలిపారు. రేణిగుంట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి మీదుగా ఈ రైలు నడవాల్సి ఉండగా రైల్వే పనుల వల్ల కాట్పాడి, పాకాల, ధర్మవరం, గుత్తి మీదుగా నడపనున్నామన్నారు.

జిల్లాలో ఓ మోస్తరు వర్షం

కడప అగ్రికల్చర్: బుధవారం తెల్లవారుజామున జిల్లాలోని పలు మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. పెండ్లిమర్రి మండలంలో అత్యధికంగా 6.6 ఎంఎం వర్షం కురవగా, సింహాద్రిపురం మండలంలో అత్యల్పంగా 0.4 మిల్లీమీటర్లు కురిసింది. అలాగే సిద్దవటంలో 5.2 ఎంఎం, వేములలో 4.2 ఎంఎం, బద్వేల్‌లో 3 ఎంఎం, ఒంటిమిట్ట, గోపవరం, అట్లూరు, జమ్మలమడుగు మండలాల్లో 2.4 ఎంఎం, బి.మఠం, కాశినాయన మండలాల్లో 2 ఎంఎం, బి.కోడూరులో 1.4 ఎంఎం, వీఎన్‌పల్లెలో 1 ఎంఎం వర్షం కురిసింది. దీనివల్ల ఆరుతడి పంటలకు కొంతమేర మేలు జరిగింది.

ఫెలోస్ నియామకానికి దరఖాస్తులు

కడప సెవెన్‌రోడ్స్: యాస్పిరేషనల్ బ్లాక్స్ ప్రోగామ్‌లో భాగంగా చింతొమ్మదిన్నె, జమ్మలమడుగు మండలాల్లో ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో కాంట్రాక్టు పద్ధతిన ఫెలోస్‌ను నియమిస్తున్నట్లు జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలకోసం హెచ్‌టీటీపీఎస్://కడప.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను పరిశీలించాలని సూచించారు.

నాట్యాచార్యులు 'చల్లా' కన్నుమూత



చల్లా జగజ్జీవన్‌రావు

కడప కల్చరల్: ప్రముఖ నాట్యాచార్యులు చల్లా జగజ్జీవన్‌రావు (61) కడప నాగరాజుపేటలోని ఆయన స్వగృహంలో బుధవారం కన్నుమూశారు. కొద్దికాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించడంతో మృత్యువాత పడ్డారు. దాదాపు 40 సంవత్సరాలుగా సంప్రదాయ నృత్య గురువుగా ఆయన వెయ్యి మందికి పైగా నర్తకులను తీర్చిదిద్దారు. దేశంలోని అన్ని ప్రముఖ నగరాల్లో ఆయన తన శిష్య బృందంతో ప్రదర్శనలు ఇచ్చారు. గురువారం ఆయన అంతిమ సంస్కారాలు నిర్వహించనున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్ద కుమార్తె హిమ హారతి నాట్యంలో తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తున్నారు.

ఆచరణలో సామాజిక న్యాయం!

పేదలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం, సంక్షేమంలో అగ్రపీఠం సీఎం వైఎస్ జగన్ సర్కార్‌లో దక్కింది. మునుపెన్నడూ లేని చరిత్రను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సృష్టించింది. అణగారిన వర్గాలను సొంతం చేసుకొని, వారి ఉన్నతికి విశేషంగా కృషి చేస్తోంది. మాటలకే పరిమితమైన సామాజిక న్యాయం ఆచరణలో చూపెట్టింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఉన్నతే లక్ష్యంగా పనిచేస్తోంది.

- రాజ్యాధికారంలో భాగస్వామ్యం, సంక్షేమంలో అగ్రపీఠం
- వైఎస్ జగన్ సర్కార్‌లో బడుగు, బలహీన వర్గాల ఉన్నతికి విశేష కృషి
- కడప గడపకు సమున్నత గౌరవం డిప్యూటీ సీఎం హోదా
- నేడు కడపలో సామాజిక సాధికార యాత్ర



సాక్షి ప్రతినిధి, కడప: పేద ప్రజల జీవనాన్ని దగ్గరగా పరిశీలించిన సీఎంఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే, వారి ఉన్నతి లక్ష్యంగా అడుగులు వేస్తున్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో రాజకీయంగా, సామాజిక పరంగా అగ్రపీఠం వేశారు. సంక్షేమ పథకాలు ద్వారా నేరుగా పేదలకు సాయం చేస్తున్నారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల సంక్షేమానికి వివిధ ప్రభుత్వ పథకాల ద్వారా రూ.7,984.48 కోట్లు అందించారు. అందులో ఎస్సీలకు రూ.2,000.92 కోట్లు, ఎస్టీలకు రూ.212.47 కోట్లు, బీసీలకు రూ.5,263.09 కోట్లు, మైనార్టీలకు రూ.508 కోట్లు దక్కింది. చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా పేదలకు నేరుగా డబ్బులు అందిస్తోన్న చరిత్రను సొంతం చేసుకుందని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

కడప గడపలో రూ.1,474కోట్లు పంపిణీ...

కడప నియోజకవర్గంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వివిధ పథకాల వల్ల డైరెక్టు బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ ద్వారా రూ.1,474.92 కోట్లు అందించింది. నవరత్నాలు పథకాల్లో భాగంగా వివిధ సామాజిక వర్గాలకు చెందిన 1,40,072 మంది లబ్ధిదారులకు సంక్షేమ పథకాల లబ్ధి నేరుగా లబ్ధిదారులకే అందించింది. వారిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన 89,274 మంది లబ్ధిదారులున్నారు. వీరికి రూ.1,164.28 కోట్లు సంక్షేమ పథకాల రూపంలో లబ్ధి చేకూరింది. అందులో బీసీలకు రూ.526.42 కోట్లు, ఎస్సీలకు రూ.157.43కోట్లు, ఎస్టీలకు రూ.24.26 కోట్లు, మైనార్టీలకు రూ.456.17 కోట్లు అందించారు. ఇంతటి భారీ స్థాయి ఆర్థిక చేయూత చరిత్రలో ఎన్నడూ లభించలేదని విశ్లేషకులు భావిస్తున్నారు.

టీడీపీ శ్రద్ధంతా బలహీనవర్గాల ఓట్లు పైనే...

బడుగు బలహీన వర్గాల ఓట్లుపైనే టీడీపీ శ్రద్ధ చూపెట్టేదని, వారి ఆర్థిక, సామాజిక ఉన్నతికి ఏనాడు కృషి చేసిన దాఖలాలు లేవని పరిశీలకులు వెల్లడిస్తున్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన బీసీల జపం చేసేదని, ఆ తర్వాత పట్టించుకున్న పాపాన పోలేదని పలువురు వివరిస్తున్నారు. అధికారంలో ఉండగా, ఆదరణ పేరుతో పనిముట్లు పంపిణీ చేసి కులవృత్తులకు మాత్రమే పరిమితం అయ్యేలా చర్యలుండేవి. కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు మాత్రమే బడుగులను వాడుకునేదని రాజకీయ విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. మైనార్టీ వర్గాలకు చెందిన వ్యక్తి మంత్రి లేకుండా ఐదేళ్లు పాలించిన ఘనత చంద్రబాబు సర్కార్‌కు దక్కుతోందని పలువురు వివరిస్తున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్‌లో రిజర్వేషన్లు కంటే అధికంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పదవులు అప్పగించి చరిత్ర సృష్టించిందని పలువురు వివరిస్తున్నారు.

కడప గడపకు అరుదైన గౌరవం...



ఎస్‌బీ అంజాద్‌బాషా



కె సురేష్‌బాబు

కడపకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అరుదైన గౌరవం దక్కింది. కడప ఎమ్మెల్యే అంజద్‌బాషాకు డిప్యూటీ సీఎం హోదా అప్పగించారు. కడప చరిత్రలో డిప్యూటీ సీఎం హోదా దక్కించుకున్న తొలి నాయకుడిగా అంజాద్ చరిత్రలో నిలవనున్నారు. కడప ప్రథమ పౌరుడుగా సురేష్‌బాబుకు రెండుపర్యాయాలు వరుసగా అవకాశం దక్కింది. ఉమ్మడి జిల్లాలో మరో ముస్లిం మైనార్టీ నేత జకియా ఖానమ్‌కు ఎమ్మెల్సీతోపాటు శాసనమండలి డిప్యూటీ చైర్మన్‌గా ఎంపిక చేశారు. బీసీలకు చెందిన రమేష్‌యాదవ్‌కు ఎమ్మెల్సీ లభించింది. మైనార్టీ నాయకుడు కరీముల్లాకు వేర్‌హౌస్ కార్పొరేషన్ చైర్మన్ చేశారు. నాయిబ్రాహ్మణ నేత యానాదయ్యకు టీటీడీ బోర్డు మెంబర్‌గా అవకాశం కల్పించారు. ఎస్సీలకు చెందిన పులి సునీల్ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్‌గిరి లభించింది. స్థానిక సంస్థల నుంచి రాష్ట్ర స్థాయి పదవుల వరకూ 372 మంది వివిధ హోదాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

ఆత్మగౌరవం నిలుపుకోవడం కోసం....

ఓ వైపు రాజకీయ పదవులు, మరోవైపు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో బడుగులకు ఆత్మగౌరవం సగౌరవంగా నిలుస్తోంది. సీఎం వైఎస్ జగన్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల ద్వారా జగనన్న అమ్మ ఒడి, వైఎస్సార్ రైతు భరోసా, సున్నా వడ్డీ, ఉచిత పంటల బీమా, పింఛన్ కానుక, చేయూత, ఆసరా, బీమా, నేతన్న నేస్తం, జగనన్న చేదోడు, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, కళ్యాణమస్తు, షాదీతోఫా, జగనన్న తోడు తదితర పథకాల ద్వారా జిల్లాలోని 19,54,575 మంది లబ్ధిదారులకు రూ.12,061 కోట్లు లబ్ధి చేకూరింది. అందులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన 12,86,500 మంది లబ్ధిదారులున్నారు. ఆయా వర్గాలకు రూ.7,984.48 కోట్లు నేరుగా లభించింది. రాజకీయంగా అందలం అప్పగించడం ఓ వైపు ఆర్థిక చేయూత నివ్వడం మరోవైపు కొనసాగుతోన్న నేపథ్యంలో ఆత్మగౌరవం అలాగే కొనసాగేలా అడుగులు వేస్తున్నారు. బడుగులకు అండగా ఉంటున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపర్చాలని కోరుతూ చేపట్టిన సామాజిక సాధికార యాత్ర గురువారం కడపలో చేపట్టనున్నారు. రవీంద్రనగర్ యూస్ ఫంక్షన్ హాల్‌లో తటస్థులతో సమావేశం నిర్వహించిన అనంతరం ర్యాలీగా పాత కలెక్టరేట్ వద్దకు చేరుకొని అక్కడ బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి పలువురు మంత్రులు, నేతలు హాజరుకానున్నారు.

బీసీల ఆత్మబంధువు వైఎస్ జగన్



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల ఆత్మబంధువుగా మారారు. బీసీలకు 56 కార్పొరేషన్లు చేసి చైర్మెన్లు, డైరెక్టర్లను నియమించారు. 54 ఏళ్ల చరిత్రలో కడప వ్యవసాయ మార్కెట్ యార్డు కు ఒక బీసీ మహిళ చైర్మెన్ కావడం ఇదే తొలిసారి. బీసీ జన గణనకు శ్రీకారం చుట్టిన గొప్ప నాయకుడు వైఎస్ జగన్. – బంగారు నాగయ్య యాదవ్, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం

రాజ్యాధికారంలో దళితులకు అగ్రపీఠం



దళిత, బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం కల్పించడంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేశారు. రాష్ట్రంలో హోంమంత్రి పదవితోపాటు, ఉప ముఖ్యమంత్రి పదవి, విద్యాశాఖామంత్రి వంటి పదవులు ఎస్సీలకే ఇచ్చారు. దళితులు మా బంధువులని చెప్పిన మనసున్న నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. –సీహెచ్ వినోద్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం

మైనార్టీలంటే సీఎంకు మక్కువ ఎక్కువ



ముస్లిం మైనార్టీలపై సీఎంకుమక్కువ ఎక్కువ. చంద్రబాబు తన మంత్రివర్గంలోకి ఒక్క మైనార్టీని కూడా తీసుకోకుండా ముస్లింలను చిన్నచూపు చూశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నలుగురు మైనార్టీలను ఎమ్మెల్యేలుగా చేసి, అందులో కీలకమైన ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చారు. మరో నలుగురికి ఎమ్మెల్సీ పదవులు ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఇన్ని పదవులు రాలేదు. – అహ్మద్‌బాషా, మైనార్టీ నాయకులు

మెడికల్ కళాశాల నిర్మాణ పనుల పరిశీలన

పులివెందుల రూరల్: పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులను బుధవారం కలెక్టర్ విజయరామరాజు పరిశీలించారు. ముందుగా కడప రోడ్డులో 50 ఎకరాలలో రూ.500కోట్లతో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. డిసెంబర్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతులమీదుగా బ్లాక్‌లను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో మోడల్ టౌన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు.మోడల్ టౌన్‌లో జరుగుతున్న గరండాల్ రివర్, మినీ సెక్రటేరియట్, రింగ్ రోడ్డు నిర్మాణ పనులు, క్రికెట్ స్టేడియం పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, ఆర్డీఓ వెంకటేశులు మున్సిపల్ ఇన్‌చార్జి మనోహర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక ప్రగతికి బ్యాంకర్లు సహకరించాలి

కలెక్టర్ విజయరామరాజు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా ఆర్థిక ప్రగతికి బ్యాంకర్లు సహకరించాలని కలెక్టర్ విజయరామరాజు కోరారు. బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన డిస్ట్రిక్ట్ కన్సల్టెటివ్ కమిటీ (డీసీసీ), డిస్ట్రిక్ట్ లెవెల్ రివ్యూ కమిటీ (డీఎల్ఆర్‌సీ) సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాంకులకు నిర్దేశించిన ఋణ లక్ష్యాలు, సాధించిన ప్రగతిని సమీక్షించారు. 2023 సెప్టెంబర్ 30 నాటికి జిల్లా క్రెడిట్ ప్లాన్ లక్ష్యం రూ.14,924 కోట్లకుగాను రూ.9,572.86 కోట్ల రుణాలు మంజూరు చేసి 64.14 శాతం ఆర్థిక ప్రగతిని సాధించడం అభినందనీయమన్నారు. పంట రుణాలు రూ.6,676 కోట్ల లక్ష్యానికి గాను.. రూ.3,824.16 కోట్ల రుణాలను అందజేసి 57.28 శాతం ఆర్థిక ప్రగతిని సాధించారన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలకు రూ. 2,889 కోట్ల రుణ లక్ష్యం కాగా రూ.2,037.07 కోట్ల రుణాలను మంజూరు చేశారన్నారు. వ్యవసాయ రంగానికి సంబంధించి రూ.9,565 కోట్ల లక్ష్యం కాగా రూ.4,056.84 కోట్ల రుణాలు అందజేసి 61.27 శాతం పురోగతి సాధించామన్నారు. ఎస్ఎంఈ సెక్టార్‌కు రూ.2,045 కోట్ల లక్ష్యం కాగా రూ.1,435.03 కోట్ల రుణాలు అందజేసి 70.17 శాతం ప్రగతి సాధించడం జరిగిందన్నారు. ఇతర ప్రాధాన్యతా రంగాలకు సంబంధించి రూ.1,037 కోట్ల రుణ లక్ష్యం కాగా రూ.286.53 కోట్ల రుణాలు అందజేసి 27.36 శాతం ప్రగతి సాధించామన్నారు. రుణాలు అందించడంలో సెప్టెంబర్ మాసంతానికి గాను వైఎస్ఆర్ జిల్లా పురోగమనంలో కొనసాగుతున్నందుకు బ్యాంకర్లను అభినందిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అనేక రకాల సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని అందుకు సంబంధించి అన్ని రకాల బ్యాంకు శాఖలు ఆయా పట్టణ, గ్రామీణ పరిధిలో రుణ పథకాలకు అర్హత పొందిన లబ్ధిదారులకు పెండింగ్ లేకుండా రుణాలు అందించాలని బ్యాంకు అధికారులను ఆదేశించారు. మండల స్థాయిలో మండల బ్యాంకింగ్ కమిటీలను ఏర్పాటు చేసి ప్రతి నెలా ఆ మండలంలో బ్యాంకర్ల ఆర్థిక పురోగతిపై సమీక్ష నిర్వహించాలని ఎల్‌డీఎంను ఆదేశించారు. జిల్లాలో ప్లాస్టిక్ నిషేధాన్ని సామాజిక బాధ్యతగా ప్రోత్సహిస్తూ ఫ్లెక్సీ ప్రింటింగ్ యూనిట్ల ఏర్పాటు కోసం రుణాలు ఇవ్వకూడదని బ్యాంకర్లను ఆదేశించారు. తొలుత జిల్లా లీడ్‌బ్యాంకు చీఫ్ మేనేజర్ దుర్గా ప్రసాద్ అజెండా వివరాలను తెలియజేశారు. పలు శాఖల ద్వారా ప్రభుత్వం అందజేస్తున్న రుణాల ప్రగతిని ఆయా శాఖల అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

28న రెండోదశ క్రీడాపోటీలు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని అంతర్ కళాశాల రెండోదశ క్రీడా పోటీలు ఈనెల 28న నిర్వహిస్తున్నట్లు వైవీయూ క్రీడా బోర్డు కార్యదర్శి డాక్టర్ కె.రామసుబ్బారెడ్డి తెలిపారు. యోగ, టగ్ఆఫ్‌వార్, టేబుల్ టెన్నిస్ క్రీడాంశాల్లో పురుషులు, మహిళల విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు పదోతరగతి, ఇంటర్, డిగ్రీ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఎలిజిబిలిటీ ఫాంలను వెంట తీసుకురావాలని సూచించారు.

నేటి నుంచి కాలజ్ఞాని జయంతి ఉత్సవాలు



బి.మఠంలో ఉద్యానవనంలోని వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం

బ్రహ్మంగారిమఠం: కాలజ్ఞాన ప్రభోదకర్త వీరబ్రహ్మేంద్ర స్వామి 415వ జయంతి ఉత్సవాలను మఠం నిర్వాకులు నేటి నుంచి 25వరకు ఘనంగా జరపనున్నారు. మఠం పిట్‌పర్సన్ ఎండో మెంట్ ఏసీ శంకర్‌బాలాజీ ఆధ్వర్యంలో మేనేజర్ ఈశ్వరాచారి ఉత్సవ ఏర్పాట్లను పూర్తి చేశారు. జయంతి ఉత్సవాలు గురువారం ఉదయం సుప్రభాతం వేద పారాయణంతో మొదలుకానున్నాయని మేనేజర్ ఈశ్వరాచారి తెలిపారు.

కోటి దీపోత్సవానికి రామయ్య

ఒంటిమిట్ట: హైదరాబాద్‌లో గురువారం జరిగే కోటి దీపోత్సవంలో సీతారాముల కల్యాణానికి ఒంటిమిట్ట రామయ్య ఉత్సవమూర్తులను తీసుకెళ్తున్నట్లు ఆలయ డిప్యూటీ ఈఓ నటేష్ బాబు తెలిపారు. ఈ నేపథ్యంలో బుధవారం మూడో శతాబ్దానికి చెందిన ఈ ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒంటిమిట్టకు అయోధ్య అక్షింతలు

ఒంటిమిట్టకు బుధవారం ఆర్ఎస్ఎస్ నేత వేణుగోపాల్‌రాజు ఆధ్వర్యంలో అయోధ్య రామ మందిరం నుంచి అక్షింతలు చేరాయి. వీటిని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉంచి నెల పాటు పూజలు చేస్తారు.



కన్యకాపరమేశ్వరి ఆలయానికి తీసుకువచ్చిన అయోధ్య అక్షింతలు

గడప గడపకు అభివృద్ధి ఫలాలు

- ప్రాథమిక, మౌలిక వసతుల కల్పన
- సచివాలయ పరిధిలో రూ. 20 లక్షలతో పనులు
- జిల్లాలో 2182 ప్రాధాన్యత పనుల్లో 1009 పూర్తి
- రూ.103.87 కోట్లు మంజూరు



ప్రొద్దుటూరులో కాలువల నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే (ఫైల్)



చెన్నూరు మండలం గోపవరం గ్రామం శివాలపల్లి గ్రామ పంచాయతీలో వేసే సిమెంటు రోడ్డు

కడప సెవెన్‌రోడ్స్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన మదిలో మెరిసే సరికొత్త ఆలోచనలకు కార్యరూపం ఇవ్వడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అర్హులైన వారి ఇంటి ముంగిటకు అందిస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం అనే కార్యక్రమం ఈ కోవలోనిదే. ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టి విజయవంతంగా మూడు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని 2022 మే 11న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడం దీని ఉద్దేశ్యం. ఇందులో భాగంగా ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు తమ నియోజకవర్గాల్లో ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పర్యటించారు. ప్రజలకు అవసరమైన ప్రాథమిక, మౌలిక వసతులను గుర్తించారు. ఈ మేరకు ఆయా పనులకు నిధులు మంజూరు చేసే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వం కలెక్టర్లకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త పనులు చేపట్టడమే కాకుండా ఇప్పటికే ఉన్న వాటిని నిర్వహణ చేసేందుకు ప్రతి గ్రామ, వార్డు సచివాలయానికి రూ. 20 లక్షలు చొప్పున నిధులు మంజూరు చేసే అధికారం కలెక్టర్లకు ఉంటుంది. ప్రజాప్రతినిధులు గడప గడపకు తిరిగిన పుడు తమకు ఫలానా సౌకర్యాలు కల్పించాలంటూ ప్రజల నుంచి నేక వినతులు వచ్చాయి. అలా జిల్లాలో వచ్చిన వినతులు పరిశీలించిన తర్వాత 2182 పనులను రూ. 103.87 కోట్ల అంచనా వ్యయంతో మంజూరు చేశారు. ఇందులో ఈనెల 7వ తేది నాటికి 1009 పనులు పూర్తయ్యాయి.


మంజూరైన పనుల వివరాలు

జీజీఎంపీ కింద రూ. 7491.97 లక్షల అంచనా వ్యయంతో 1475 రోడ్డు పనులు మంజూరు చేశారు. అలాగే రూ. 145.75 లక్షలతో 47 విద్యుత్ సంబంధిత పనులు, రూ. 298.46 లక్షలతో కల్వర్టుల నిర్మాణం, రూ. 306.99 లక్షలతో కాంపౌండ్ వాల్స్, ప్రొటెక్షన్ వాల్స్ తదితర 62 సివిల్ వర్క్స్, రూ. 1386.50 లక్షలతో 302 డ్రెయిన్స్ నిర్మాణం, రూ. 757.68 లక్షలతో 218 తాగునీటి పనులు మంజూరు చేశారు.

నియోజకవర్గాల వారీ పనుల స్టేటస్

నియోజకవర్గం.	మంజూరు	అంచనా వ్యయం (రూ.లక్షల్లో)	పూర్తయినవి	పురోగతిలో ఉన్నవి	మొదలు కానివి
బద్వేలు	429	1483.81	189	207	33
జమ్మలమడుగు	428	1634.00	250	174	04
కడప	223	2238.98	129	58	36
కమలాపురం	394	1678.01	186	178	30
మైదుకూరు	361	1277.90	85	263	13
ప్రొద్దుటూరు	246	1596.28	127	109	10
పులివెందుల	64	359.27	30	15	19
రాజంపేట	37	119.10	13	24	--
మొత్తం	2182	10387.35	1009	1028	145

జీజీఎంపీ పనులకు అధిక ప్రాధాన్యత



ప్రజల ప్రాథమిక, మౌలిక సౌకర్యాల కల్పనకు సంబంధించిన జీజీఎంపీ పనులకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోంది. జిల్లాలో రూ. 10387.35 లక్షల అంచనా వ్యయంతో 2182 పనులు మంజూరు కాగా, అందులో ఇప్పటికి 1009 పూర్తయ్యాయి. ఇక 1028 పనులు వివిధ దశల్లో ఉండగా, 145 ప్రారంభం కాలేదు. ఇప్పటికీ 739 పనులకు రూ. 2910.81 లక్షలు చెల్లించాం.ఇక 140 పనులకు సంబంధించి 531.68 లక్షల రూపాయల బిల్లులు అప్‌లోడ్ చేశాం. త్వరలోనే నిధులు విడుదల కానున్నాయి. బిల్లులు అప్‌లోడ్ చేసిన వెంటనే ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోంది. బిల్లుల చెల్లింపులో జాప్యానికి అవకాశం లేదు. పనుల పురోగతిపై కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధతో సమీక్షిస్తున్నారు. – వెంకట్రావు, ముఖ్య ప్రణాళిక అధికారి, వైఎస్సార్ జిల్లా

నవశకం



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడ్డాయి. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలకు కూడా మోక్షం లభించింది. కుల, ఆదాయ సర్టిఫికెట్లు, సొంత ఇళ్లు, మెరుగైన విద్య అందుతోందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి నెట్‌వర్క్

నెరవేరిన సొంతింటి కల



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నవరత్నాలలో భాగంగా చెప్పిన మాట ప్రకారం పేదలకు సొంతింటి కల నెరవేర్చాడు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అనేక మార్లు ఇంటి కోసం కార్యాలయాల చుట్టూ తిరిగినా సొంతింటి కల నెరవేరలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన వెంటనే జగనన్న కాలనీల పేరుతో ఊర్లను నిర్మిస్తున్నారు. నల్లపురెడ్డిపల్లె గ్రామంలో జగనన్న కాలనీలో ప్రభుత్వం ఇచ్చిన నిధులతోపాటు సొంత డబ్బులతో సొంతింటి కల నెరవేర్చుకున్నాం. చాలా ఆనందంగా ఉంది.

– మండ్ల ఉమా మహేశ్వరి, నల్లపురెడ్డిపల్లె, పులివెందుల మండలం

అమ్మఒడి అందుతోంది



మా కుమారుడు నంద్యాల వెంకట సాకేత్ మూడో తరగతి చదువుతున్నాడు. మా కుమారుడికి మూడు సార్లు అమ్మ ఒడి పథకం అందింది. నాడు–నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలు రూపురేఖలు మారాయి. మన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారు.

– నంద్యాల వెంకటేశ్వరమ్మ, ఎర్రగుంట్ల

మధ్యాహ్న భోజనంలో బల్లి



జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులు



విద్యార్థులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

- 27 మంది విద్యార్థులకు అస్వస్థత
- టీకులపాలెం పాఠశాలలో ఘటన
- ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆదేశాలతో తక్షణ వైద్యసేవలు
- ప్రాణాపాయం లేదన్న వైద్యులు

మదనపల్లె : మండలంలోని బొమ్మనచెరువు పంచాయతీ టీకులపాలెం ఎంపీయూపీ పాఠశాలలో బుధవారం మధ్యాహ్న భోజనంలో బల్లి పడింది. ఈ ఆహారం తిన్న 27 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. తల్లిదండ్రులు హుటాహుటిన మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. సర్పంచ్ దండుకరుణాకర్‌రెడ్డి ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా తక్షణమే స్పందించి, వైద్యసిబ్బందిని అప్రమత్తం చేయడంతో జిల్లా ఆస్పత్రిలోని వైద్యులు పిల్లలకు వైద్యచికిత్స అందించారు. ముగ్గురు విద్యార్థులు వాంతులు అధికంగా చేసుకుని నీరసానికి లోనయ్యారు. మిగిలిన వారికి ఎలాంటి ఇబ్బంది లేకపోవడంతో ప్రాథమిక చికిత్స , అవసరమైన మందులు అందించి డిశ్చార్జి చేశారు. విద్యార్థులకు ఎలాంటి ప్రాణాపాయం లేదని జిల్లా ఆస్పత్రి వైద్యులు తెలిపారు. టీకులపాలెం ఎంపీయూపీ పాఠశాలలోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో భాగంగా బుధవారం వెజిటబుల్ రైస్, కుర్మా వడ్డించారు. విద్యార్థులు భోజనాన్ని ఆరగిస్తుండగా, పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థి తనకు వడ్డించిన భోజనంలో బల్లి పడి ఉండటాన్ని గమనించాడు. అప్పటికప్పుడే విషయాన్ని ఉపాధ్యాయులకు తెలపడంతో వారు ఆహారాన్ని పడేయాలని విద్యార్థులకు సూచించారు. బల్లి పడిన ఆహారం తినేశామన్న విషయం విద్యార్థులకు తెలియడంతో ఒక్కసారిగా వారందరిలో ఆందోళన అధికమైంది. పాఠశాలలో మొత్తం 103 మంది విద్యార్థులు ఉండగా, వారిలో భోజనాన్ని 84 మంది వరకు తిన్నారు. వీరిలో 27 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వెంటనే అప్రమత్తమైన పాఠశాల సిబ్బంది, గ్రామంలోని తల్లిదండ్రులకు విషయం తెలిపి, ఆటోలు, టూవీలర్స్, కారుల్లో విద్యార్థులను జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆదేశాలతో అప్పటికే సిద్ధంగా ఉన్న వైద్యులు పిల్లలకు తక్షణ వైద్యసేవల్లో భాగంగా సెలైన్ బాటిల్స్ పెట్టి ప్రాణాపాయం లేకుండా చికిత్స అందించారు. ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ, డీఎస్పీ కేశప్ప, తాలూకా సీఐ సత్యనారాయణ పిల్లలను పరామర్శించి, తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. ఈ ఘటనపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, వంట నిర్వాహకురాలు భాగ్యలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం శేఖర్‌నాయుడుపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఎంఈఓ ప్రభాకరరెడ్డి, రాజగోపాల్‌లను ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆదేశించారు.

ఘటనపై పలు అనుమానాలు..

మధ్యాహ్నభోజనం తిన్న విద్యార్థులకు అస్వస్థతపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పాఠశాలకు వంటగది ఉన్నప్పటికీ వంట నిర్వాహకురాలు ఆరుబయట వంట చేసింది. ఆహారంలో బల్లి పడిందని చెప్పిన ఎనిమిదో తరగతి విద్యార్థి హేమంత్‌ను బల్లిని ఏంచేశావని అడిగితే ఉపాధ్యాయులు పారేయమన్నారని చెప్పుకొచ్చాడు. పాఠశాలలో హెచ్‌ఎం శేఖర్‌నాయుడుతో పాటు మరో ఐదుగురు ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ మధ్యాహ్నభోజనం వడ్డించే సమయంలో వారెవరూ పర్యవేక్షించలేదని తెలిసింది. విద్యార్థులను అడిగితే హెచ్‌ఎం కారు కడుక్కుంటున్నారని, ఉపాధ్యాయులు ఎవరూ లేకపోవడంతో ఎప్పటిలాగే విద్యార్థులే వడ్డించుకున్నామని తెలిపారు. అయితే...హెచ్‌ఎం, ఉపాధ్యాయులు చెప్పింది మరోలా ఉంది. విద్యార్థి హేమంత్‌కుమార్ ఆహారంలో బల్లి పడిందని అరిచాడే తప్ప తమకు చూపించలేదన్నారు. అతడి అరుపులకు పిల్లలు భయాందోళనకు గురయ్యారే తప్ప వాంతులు చేసుకోలేదన్నారు. వెంటనే ఆస్పత్రికి తీసుకురావడంతో సెలైన్, ఎలక్ట్రోరల్ ఫ్లూయిడ్స్ తాగించడం ద్వారా కోలుకున్నారని చెప్పారు. ఇదే విషయాన్ని ఎంఈఓకు హెచ్‌ఎం రాతపూర్వకంగా రాసి ఇచ్చారు. కాగా ఈ విషయాన్ని తమకు అనుకూలంగా మలుచుకోవాలని విద్యార్థి సంఘాలు, ప్రతిపక్షాలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు.

పుట్టెడు దుఃఖంలోనూ విధి నిర్వహణ

మదనపల్లె ఆర్డీఓ ఎం.ఎస్.మురళీకి మాతృవియోగం కలిగింది. బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఆర్డీఓ మురళీ తల్లి చెంగమ్మ(96) అనారోగ్యంతో మృతిచెందారు. తల్లి మరణవార్తతో పుట్టెడు దుఃఖంలో ఉన్న ఆర్డీఓ మురళీకి మండలంలోని టీకులపాలెం ఎంపీయూపీ పాఠశాల విద్యార్థులు మధ్యాహ్న భోజనంలో బల్లి పడిన ఆహారం తిని అస్వస్థతకు గురయ్యారన్న విషయం తెలిసిన వెంటనే ఇంటి నుంచి నేరుగా జిల్లా ఆస్పత్రికి బయలుదేరారు. విద్యార్థుల నుంచి ఘటనకు కారణాలను తెలుసుకుని, జిల్లా ఆస్పత్రిలో వారికి అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అందరికీ బాగయ్యేవరకు వైద్యుల పర్యవేక్షణలో జాగ్రత్తగా చూసుకుంటామని భరోసా కల్పించారు. తర్వాత అక్కడి నుంచి సబ్‌కలెక్టరేట్‌కు చేరుకుని ఎన్నికల విధుల్లో భాగంగా అన్ని రాజకీయపార్టీల ప్రతినిధులతో ఓటరు జాబితా స్వచ్ఛీకరణపై సమావేశం నిర్వహించారు. అనంతరం సెక్టోరియల్ అధికారులతో పోలింగ్ కేంద్రాల్లో కల్పించాల్సిన మౌలిక వసతులు, రూట్ సౌకర్యాలపై చర్చించారు. ఆర్డీఓ తల్లి చెంగమ్మ అంత్యక్రియలు గురువారం మధ్యాహ్నం 12గంటలపైన స్వగ్రామం వి.కోట మండలం కృష్ణాపురంలో జరుగుతాయని తెలిపారు.



ఆర్డీఓ తల్లి చెంగమ్మ

నేటి నుంచి జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు దరఖాస్తులు

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు కేటాయించే ఇళ్ల స్థలాల కోసం ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ఈ నెల 23వ తేదీ నుండి ప్రారంభమవుతుందని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి పి. వేణుగోపాల్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు రాష్ట్రంలో వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తూ అక్రిడిటేషన్ కలిగిన అర్హులైన జర్నలిస్టులకు హౌసింగ్ స్కీమ్ కింద ఇంటి స్థలాలను అందించేందుకు ప్రభుత్వం జీఓ నెంబర్ 535 జారీ చేసిందన్నారు. అర్హులైన జర్నలిస్టులు ఇళ్ల స్థలాల కోసం హెచ్‌టీటీపీ://ఐపీఆర్.ఏపీ.జీఓవీ.ఇన్/ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. 45 రోజుల్లోగా (2024 జనవరి 6వ తేదీ) పైన తెలియజేసిన వెబ్‌సైట్ లో జర్నలిస్టులు సంబంధిత వివరాలతో ఆన్‌లైన్‌లో తమ దరఖాస్తును సమర్పించాలన్నారు. అక్రిడిడేటెడ్ జర్నలిస్టులకు కేటాయిస్తున్న ఇళ్ల స్థలం విలువలో 60 శాతం ప్రభుత్వం, 40 శాతం జర్నలిస్టులు చెల్లించాలని ఆయన తెలిపారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత జర్నలిస్ట్ అక్రిడిటేషన్ వివరాలను, జర్నలిస్ట్‌గా వారి వృత్తి అనుభవాన్ని ప్రాథమికంగా పరిశీలించి, అర్హులైన జర్నలిస్టుల జాబితాలను రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్లకు అందజేస్తారన్నారు. అనంతరం జిల్లా కమిటీలు నిబంధనల మేరకు జర్నలిస్టుల అర్హతను పరిశీలించి ఇళ్ల స్థలాలను కేటాయించడానికి సరైన స్థలాలను జిల్లా పరిధిలోనే గుర్తిస్తాయని ఆయన వివరించారు. అర్హులైన అక్రిడిడేటెడ్ జర్నలిస్టులందరూ నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్ లో తమ దరఖాస్తులను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.

స్కూలు వ్యానును ఢీకొన్న కారు

పులివెందుల రూరల్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డు జేఎన్‌టీయూ కళాశాల సమీపంలో స్కూలు వ్యానును కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. తుమ్మలపల్లె గ్రామం నుంచి పులివెందులకు వస్తున్న స్కూలు వ్యానును పులివెందుల నుంచి ముద్దనూరు వైపు వెళుతున్న కారు ఢీకొంది. దీంతో ఈ రెండు వాహనాలలో ప్రయాణిస్తున్న పలువురు గాయపడ్డారు. చికిత్స కోసం వారిని పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మరోమారు ఎమ్మెల్యే రాచమల్లు దాతృత్వం

ఎస్సీ విద్యార్థిని మెడిసిన్ చదివేందుకు రూ.50లక్షలు వెచ్చిస్తానని భరోసా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి మరోమారు తన దాతృత్వాన్ని చాటుకున్నారు. పట్టణంలోని నిరుపేద ఎస్సీ విద్యార్థిని వాత్సల్యశ్రీ రష్యాలో ఎంబీబీఎస్ చదివేందుకు అయ్యే ఖర్చు రూ.50లక్షలు తానే వెచ్చిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. ఇందుకు సంబంధించి విద్యార్థినికి పాస్ పోర్టు, వీసాను తెప్పించానన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే రాచమల్లు బుధవారం మీడియాతో మాట్లాడుతూ పట్నం వాత్సల్యశ్రీకి ఎంబీబీఎస్ చదవాలనే కోరిక ఎప్పటినుంచో ఉందన్నారు. విద్యార్థిని కరాటేలో కూడా రాణించిందన్నారు. తన కుటుంబ ఆర్థిక పరిస్థితిని తనకు వివరించడంతో రూ.2లక్షలు వెచ్చించి కోచింగ్ ఇప్పించానన్నారు. రష్యా ఏషియన్ మెడికల్ ఇన్‌స్టిట్యూట్‌లో ఎంబీబీఎస్ సీటు రావడంతో తనను కలిసిందన్నారు. తాను ఏమాత్రం ఆలోచించకుండా ఆరేళ్ల చదవడానికి అయ్యే ఖర్చు రూ.50లక్షలను భరిస్తానని తెలిపారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు తనకు కొత్త కాదని, ఎంతో మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు తాను సాయం చేశానన్నారు. ఎవరికైనా చదువే రాజమార్గమని చెప్పారు. ఇందు కోసమే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసిందన్నారు. మన బడి నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వం విద్యాభివృద్ధికి కృషి చేస్తోందని చెప్పారు. విద్యావంతుల కుటుంబంలో జన్మించిన తాను పేదరికంతో కొన్ని రోజులు ఇబ్బంది పడ్డానని, కేవలం విద్య కారణంగానే తన కుటుంబం మళ్లీ యథాస్థితికి వచ్చిందన్నారు. మనుషుల మధ్య అసమానతలు తొలగాలంటే విద్య ద్వారానే సాధ్యమని తెలిపారు. విద్యతోనే నాగరికత అలవడుతుందన్నారు. అనంతరం పట్నం వాత్సల్యశ్రీ మాట్లాడుతూ గాడ్ ఫాదర్ లాంటి ఎమ్మెల్యే రాచమల్లు తోనే డాక్టర్ వాత్సల్యశ్రీ అవుతానని అన్నారు. తన తండ్రి శ్రీనివాస్ ఎల్ఐసీ ఏజెంట్‌గా ఉంటూ గుండెపోటుతో మరణించాడని, ఆర్థిక పరిస్థితులు సరిగా లేకపోవడంతో ఎమ్మెల్యే రాచమల్లు గురించి తెలుసుకుని సంప్రదించానన్నారు. పెద్ద మనసుతో స్పందించిన ఆయన తన చదువుకు సహకారం అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, విద్యార్థి తల్లి సునీత పాల్గొన్నారు.

అనుబంధ రంగాల్లో వృత్తి నైపుణ్యం పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఆత్మ పీడీ విజయలక్ష్మి

కడప అగ్రికల్చర్ : గ్రామీణ యువత, మహిళలు వ్యవసాయంతోపాటు అనుబంధ రంగాలలో వృత్తి నైపుణ్యం పెంచుకుని ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవాలని అగ్రికల్చరల్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ(ఆత్మ) ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ ఎస్. విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం ఊటుకూరు ఏరువాక కేంద్రంలో అంతర్జాతీయ చిరుధాన్యపు సంవత్సరం సందర్భంగా చిరుధాన్యాల విలువ జోడింపుపై నైపుణ్య శిక్షణను నిర్వహించారు. హైదరాబాదు మానేజ్,గుంటూరు సమేటి వారి ఆర్థిక సహకారంతో వారం రోజులపాటు ఈ శిక్షణా కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు శిక్షణా కార్యక్రమానికి విజయలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ చిరుధాన్య పంటలైన రాగి, సజ్జ, కొర్ర, జొన్న, అండుకొర్ర పంటలు ఇతర పంటలతో పోలిస్తే తక్కువ ఖర్చు, పరిమితి యాజమాన్య పద్ధతులలోనే సాగు చేసుకోవచ్చన్నారు. ఈ పంటల సాగు ద్వారా చిన్న, సన్నకారు రైతులు అధిక ఆదాయం పొందవచ్చన్నారు. అధిక పోషక విలువలున్న చిరుధాన్య ఉత్పత్తులకు ఇటీవల మంచి డిమాండ్ పెరిగిందన్నారు. ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ చిరుధాన్యాల ఉత్పత్తుల ద్వారా కుటీర పరిశ్రమలు కూడా స్థాపించుకుని అధిక ఆదాయం పొందవచ్చన్నారు. వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధానశాస్త్రవేత్త శ్రీనివాసాచారి మాట్లాడుతూ చిరుధాన్యాలు అధిక పోషక విలువలు కలిగి గ్లుటేన్ రహితమై తేలికగా జీర్ణమయ్యే స్వభావం కలిగి ఉంటాయన్నారు. వీటి వినియోగం వల్ల గుండె జబ్బుల ప్రమాదం తగ్గుతుందన్నారు. ఆత్మ డీపీడీ పద్మలత, కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళ, ఏరువాక కేంద్ర విస్తరణ శాస్త్రవేత్త రామలక్ష్మిదేవి, కేవీకే శాస్త్రవేత్త ప్రశాంతి మాట్లాడారు. కేవీకే, ఏరువాక కేంద్ర శాస్త్రవేత్తలు, బోధనేతర సిబ్బంది,రైతులు పాల్గొన్నారు.

నాడు–నేడు ద్వారా అంగన్‌వాడీలకు మరమ్మతులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు నాడు–నేడు ద్వారా మరమ్మతులు చేపట్టనున్నట్లు జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ సాధికారత అధికారి శ్రీలక్ష్మి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని సభా భవనంలో సీడీపీఓలు, సూపర్‌వైజర్లతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 87 అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు ఉన్నాయన్నారు. 833 భవనాలకు మరమ్మతులు చేపట్టనున్నామన్నారు. స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారులు సమన్వయం చేసుకుంటూ పనులు సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే ఐసీడీఎస్‌కు సంబంధించి మొబైల్ యాప్‌లపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. బాల్య వివాహాలు, పోక్సో కేసుల గురించి సమీక్షించామన్నారు. నాడు–నేడు కింద మంజూరైన అంగన్‌డీ కేంద్రాలకు సంబంధించి సీడీపీఓలు, సూపర్‌వైజర్లకు శిక్షణ ఇచ్చామన్నారు.

నేడు బాల్య వివాహాలపై వర్క్‌షాప్

బాల్యవివాహాలపై గురువారం జిల్లాస్థాయి వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నామని ఐసీడీఎస్ పీడీ శ్రీలక్ష్మి తెలిపారు. ఉదయం 10 గంటలకు సభా భవనంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి కలెక్టర్‌తోపాటు జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, చైల్డ్ వెల్ఫేర్ పోలీసు ఆఫీసర్లు, మహిళా పోలీసులు, ఎన్జీఓలు, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు హాజరవుతారన్నారు

ఆరో తరగతి విద్యార్థిపై పైశాచికం

రామాపురం : మండలంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో మంగళవారం ఓ విద్యార్థి మరో విద్యార్థిపై పైశాచికంగా ప్రవర్తించాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గురుకులంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థి అదే విద్యాసంస్థలో 6వ తరగతి చదువుతున్న మరో విద్యార్థి మెడకు తాడు చుట్టి పాఠశాలలోని డార్మెటరీలో ఉరి తీశాడు. అదృష్టవశాత్తు ఆ విద్యార్థి జారి కిందపడి ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నాడు. అయితే అపస్మారక స్థితిలో ఉన్న ఆ విద్యార్థిని గుర్తించిన తోటి విద్యార్థులు పాఠశాల సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఉపాధ్యాయులు కడప రిమ్స్‌కు తరలించారు. ఉపాధ్యాయులు మాత్రం విద్యార్థి కంప పొదల్లో పడి ఉన్నాడంటూ విద్యార్థి తల్లికి సమాచారం అందించారు. ఆమె కడప రిమ్స్‌కు చేరుకుని కొడుకు పరిస్థితిని చూసి తీవ్రంగా రోదించింది. విద్యార్థి మెడపై తాడుతో బిగించిన ఆనవాళ్లు.. గొంతు పూర్తిగా వాపు ఉండడంతో ఆమె రిమ్స్ అవుట్ పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. గురుకుల పాఠశాలలో గతంలో కూడా అనేక మార్లు ఘర్షణలు జరిగాయి.

కడపలో విజిలెన్స్ అధికారుల దాడులు



కడప నగరంలో భవననిర్మాణ సామగ్రి దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

కడప అర్బన్ : విజిలెన్స్, లీగల్ మెట్రాలజీ అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి బుధవారం కడప నగరంలో భవన నిర్మాణ సామగ్రి అమ్మే దుకాణాలు, టైల్స్ షోరూంలలో దాడులు నిర్వహించారు. కడప నగరంలోని వినాయకనగర్, బాలాజీనగర్ ప్రాంతాలలో యూనివర్సల్ ట్రేడర్స్, ఎస్‌బీఎంఎస్ టైల్స్ అండ్ శానిటరీ షోరూంలలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంఆర్‌పీ లేకుండా అమ్మే వస్తువులు, తయారీ తేదీ లేకుండా అమ్మే వస్తువులు తదితర లోటుపాట్లపై 4 కేసులు గుర్తించి సుమారు రూ. 40,000లను జరిమానా విధించారు. మరో బృందం కడప నగరంలోని కృష్ణ చైతన్య ఎంటర్ ప్రైజెస్, మౌనిష్క టైల్స్ అండ్ శానిటరీ షోరూం, శ్రీ శివవర్మ ఎంటర్ ప్రైజెస్, శ్రీ చైత్రిక వర్మ ఎంటర్ ప్రైజెస్‌లను తనిఖీ చేసి మొత్తం 6 కేసులు గుర్తించి సుమారు రూ. 1.05,000 జరిమానా విధించారు. అలాగే షోరూంలకు సంబంధించి స్టాక్ రిజిస్టర్, సేల్స్ రిజిస్టర్, పర్చేజ్ రిజిస్టర్ తదితర రికార్డులను, గోడౌన్‌లను తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ అధికారులు జి. ఈదురుబాషా, టి. రెడ్డెప్ప, జి. శ్రీనివాసులు, ఈ. బాలగంగాధర్ రెడ్డి, రమేష్‌రెడ్డి, లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ సి. తిమోతి నాయక్, సురసుర శ్రీనివాసులు, వెంకట రమేష్, విజిలెన్స్ హెడ్ కానిస్టేబుల్ ఎస్. జనార్దన్‌రావు, పి. సుదర్శన్ రెడ్డి, కె. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

వేముల : వి.కొత్తపల్లె జెడ్పీ హైస్కూలుకు చెందిన 8, 9 తరగతుల విద్యార్థులు ఎన్.గంగాదేవి, గంగాతిలక్‌రెడ్డిలు జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల హెడ్మాస్టర్ నరసింహరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ నుంచి 21వ తేదీ వరకు గుంటూరు జిల్లా పెద్దకాకాని మండలం వెలిగండ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14 సాఫ్ట్ బాల్ పోటీల్లో, అలాగే కర్నూలు జిల్లా నందికొట్కూరు మండలంలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్–14 బేస్‌బాల్ పోటీలలో వీరు మంచి ప్రతిభ కనబరిచారన్నారు. పీడీ శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

రిమ్స్‌లో ప్రత్యేక విభాగాలకు సూపరింటెండెంట్‌ల నియామకం







రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ నుంచి నియామక పత్రం అందుకుంటున్న డాక్టర్ ఎం. సురేశ్వర్‌రెడ్డి, డాక్టర్ వెంకటరాముడు, డాక్టర్ టి.వాణి

కడప అర్బన్ : కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) ఆవరణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ, మానసిక వైద్యశాల, కేన్సర్ హాస్పిటల్‌లో సూపరింటెండెంట్ అధికారులను నియమిస్తూ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం ఉత్తర్వులు జారీ చేశారు. సూపర్‌స్పెషాలిటీ విభాగం సూపరింటెండెంట్‌గా డాక్టర్ ఎం. సురేశ్వర్‌రెడ్డి, మానసిక వైద్యశాల సూపరింటెండెంట్‌గా డాక్టర్ వెంకటరాముడు, కేన్సర్ హాస్పిటల్ సూపరింటెండెంట్‌గా డాక్టర్ వెంకటరాముడులను నియమించారు. ఆయా అధికారులకు బుధవారం కడప రిమ్స్ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ తమ కార్యాలయంలో ఉత్తర్వులను అందచేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎం. సురేశ్వర్‌రెడ్డి, డాక్టర్ వెంకటరాముడు, డాక్టర్ టి. వాణిలతో పాటు ఆర్ఎం డాక్టర్ వై. శ్రీనివాసులు, డాక్టర్ నాగశ్రీలత, ఇతర డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.